క్లుప్తంగా

రేపు కంభంలో వైఎస్సార్ జయంతి వేడుకలు

కంభం: ఈనెలవ తేదీన 8వ తేదీన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పాల్గొంటారన్నారు. ఉదయం పది గంటలకు కందులాపురం కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: పట్టణంలోని దోర్నాల బస్టాండులో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఆదివారం జనసంఘ్ నేత రాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆపార్టీ నాయకులు నిర్వహించారు. బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1951లో భారతీయ జనసంఘ్ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందూ జాతీయవాదాన్ని విశ్వసించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్, శాసనాల సరోజినీ, లక్ష్మిదేవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ఇలవేల్పు, గ్రామదేవత తర్లుపాడు రోడ్డులో ఉన్న అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం 6 గంటలకే అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ అమ్మవారిని పూలతో, నిమ్మకాయల దండలతో అలంకరించారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నైవేద్యం వండి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఆర్టీసీ అధికారుల పచ్చపాతం!


పొదిలి డిపోలో దర్శనమిస్తున్న ఎన్టీఆర్ ఫొటో

పొదిలి రూరల్: ఆర్టీసీ అధికారులు పొదిలి డిపోలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా ముఖ్యమంత్రిగా ఎవరు ఉంటే వారి ఫొటో పెట్టడం పరిపాలనలో ఓ భాగం. కాని పొదిలి డిపోలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్టీసీ డిపోలోని అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలతో పాటు మాజీ సీఎం ఎన్టీఆర్ ఫొటో పెట్టారు. ఈ ఫొటో చూసిన ప్రతి ఒక్కరూ విమర్శలు చేస్తున్నారు.

రుణాలు దక్కేనా..
కౌలు రైతు కోలుకునేనా !

పశ్చిమ ప్రకాశంలో రుణాల కోసం కౌలు రైతుల ఎదురు చూపులు
- నత్తనడకన సీసీఆర్సీ కార్డుల జారీ
- ఈ ఏడాది లక్ష్యం 5,822 కార్డులు
- ఇప్పటివరకూ ఇచ్చింది 1924 కార్డులు


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతుల పరిస్థితి దీనంగా మారింది. గతేడాది నంచి నేటి ఖరీఫ్ సీజన్ వరకు కూడా అసలు కౌలురైతులను పట్టించుకున్న పాపాన పోలేదని కౌలు రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కౌలురైతుల కార్డుల మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, వ్యవసాయాధికారులు సంయుక్తంగా గ్రామాల్లో సమావేశాలు పెట్టి కౌలురైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలి. వీటి ద్వారా బ్యాంకు మేనేజర్లు పంటలు సాగు చేసుకునేందుకు రుణాలు అందిస్తారు. అయితే ఈ ఏడాది ఈ కార్యక్రమం నత్తనడకతో పోటీపడుతోంది. దీనితో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షాలు లేక ఇబ్బంది పడుతుండగా, మరో వైపు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందో లేదో తెలియక అయోమయంలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో పాలసీ కూడా మారి తమకు బ్యాంకర్ల రుణాలు ఇస్తారో.. లేదోనన్న సందేహం రైతుల్లో నెలకొంది.

కొందరికే సీసీఆర్సీ కార్డులు..

రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి పొలాలను కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తున్న రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో కౌలు రైతు గుర్తింపు కార్డులను అందించింది. ఈ ఏడాది మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని అర్ధవీడు, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో మొత్తం 5,822 మంది రైతులకు కౌలురైతుల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకూ 1924 మందికి మాత్రమే కార్డులు అందాయి. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. మొత్తం సబ్‌డివిజన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 20,485 హెక్టార్లల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటికి వర్షాలు లేకపోవడంతో రైతులు పంటల సాగు చేపట్టలేదు. పొలాలు దున్ని సిద్ధం చేశారు. కొంతమంది రైతులు సజ్జ, జొన్న, కంది తదితర పంటలు వేస్తున్నారు.

రుణాలివ్వని బ్యాంకర్లు..

ఎకరా పత్తిని సాగు చేయడానికి దాదాపు రూ. 40 వేల నుంచి రూ.50 వేల ఖర్చు అవుతుంది. కౌలురైతులు బ్యాంకు రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. బ్యాంక్ మేనేజర్లు వ్యక్తిగత రుణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులు పంటలు సాగు చేయాలంటే మళ్లీ అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కాపురం మండలంలోని వేములకోట, తిప్పాయపాలెం, నాగులవరం, మాల్యవంతునిపాడు, గజ్జలకొండ చెరువులకు నీరు రాకపోయినా మెట్ట పంటల సాగుకు పొలాలు అనువుగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసిన రైతులు పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఇప్పటివరకూ అన్నదాత సుఖీభవా కింద ఒక్క రూపాయి కూడా రైతులకు జమ కాలేదు. దీనితో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటివరకు మంజూరు చేసిన కౌలు కార్డులు..

మండలం	లక్ష్యం	మంజూరు చేసిన కార్డులు
మార్కాపురం	1700	817
అర్ధవీడు	895	305
కంభం	1171	318
పెద్దారవీడు	1147	259
తర్లుపాడు	909	223

కౌలురైతులకు రుణాలివ్వాలి..



రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు రైతులకు కౌలు కార్డులు ఇస్తున్నప్పటికీ బ్యాంకర్లు రుణాలివ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో బ్యాంకు మేనేజర్లు చొరవచూపి కౌలు రైతులకు రుణాలు ఇస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది. లేదంటే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– బాలనాగయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు


మార్కాపురంలో ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి వారు


కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో..


మార్కాపురంలో భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి తదితర గ్రామాల్లో తొలిఏకాదశి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొదటి పండుగ కావడంతో భక్తులు వైష్ణవ ఆలయాలకు వెళ్లారు. పట్టణంలోని లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయంలో తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. ఆలయ అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి పంచామృతాభిషేకాలతో అర్చన చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటుచేశారు.

కొనకనమిట్ల: వ్యవసాయ సీజన్ ప్రారంభంలో వచ్చే మొదటి పండగ ఏకాదశి కావడంతో అన్నీ వర్గాలకు చెందిన వారు ఆలయాల్లో పూజలు నిర్వహిచి స్వామి దర్శనం చేసుకొని భక్తితో పరవశించారు. వెలుగొండ పుణ్యక్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, ఎదురాళ్లపాడు సంగమేశ్వర ఆలయం, గొట్లగట్టు గ్రామంలోని ఆభయాంజనేయస్వామి ఆలయం, రామాలయం, పెదారికట్ల శివాలయంలలో భక్తులు గోమాతలను పూజించి విశేష పూజలు నిర్వహించారు.

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లి రామాలయాల్లో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండి రైతులు ఆనందంగా గడపాలని భగవంతుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

హాయి హాయిగా.. ఆనందంగా


పంట కాల్వలో ఈతకొడుతున్న చిన్నారులు

కంభం: చాలా కాలంగా ఎండిపోయిన పంట కాల్వల్లో ఇటీవల నీరు పారుతుండటంతో యువకులు ఆ కాలువలో ఈతకొడుతూ సందడిగా గడుపుతున్నారు. మండలంలోని దర్గా పొలాలకు నీరు ఇచ్చేందుకు ఇటీవల కంభం చెరువులో చిన్నకంభం తూమును ఇరిగేషన్ అధికారులు ఎత్తడంతో ఇరిగేషన్ కాలువలు నిండుకుండలా పారుతున్నాయి. ఆదివారం కావడంతో చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు పిల్లలు కాలువలో ఈతకొడుతూ సరదాగా గడిపారు.

రైల్వేస్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు


తనిఖీల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

మార్కాపురం: రైల్వేస్టేషన్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం గిద్దలూరు, కంభం రైల్వేస్టేషన్లలో ఒంగోలు నుంచి వచ్చిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్, టాస్క్‌ఫోర్సు సిబ్బంది తనిఖీ నిర్వహించి 9 లీటర్ల గోవా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ నరహరి తెలిపారు. ఈ సందర్భంగా పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించి గోవా మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మార్కాపురం ఏఈఎస్ బాలయ్య పర్యవేక్షణలో ఈ రెండు రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించి రెండు బ్యాగుల్లో ఉన్న గోవా లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం గాలిస్తున్నామని, త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో కంభం, గిద్దలూరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం అర్ధరాత్రినుంచి ఆదివార తెల్లవారుజాము వరకు దాడులు జరిగినట్లు తెలిపారు.

సీపీఆర్ చేసి యువకుడిని కాపాడిన పోలీసులు


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వీరనారాయణ

మార్కాపురం: బైకు అదుపు తప్పి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడికి సీపీఆర్ చేసి పోలీసులు కాపాడారు. ఈఘటన ఆదివారం మార్కాపురం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద జరిగింది. ఫైర్‌స్టేషన్ ఆఫీసరు రామకృష్ణ వివరాల మేరకు.. ఉదయం 11 గంటల సమయంలో పట్టణంలోని విజయ టాకీస్ ఏరియాలో నివాసం ఉండే ఎం వీరనారాయణ తన బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే అపస్మారక స్థితిలోనికి వెళ్లాడు. ఆ సమయంలో ఫైర్ కానిస్టేబుల్ చిరంజీవి వెంటనే అక్కడికి చేరి సీపీఆర్ చేయడంతో మళ్లీ ఊపిరి పీల్చుకున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పట్టణ ఎస్సై సైదుబాబు తన జీపులో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం చెవివద్ద పెద్దగాయం కావడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈఘటనతో యువకుడిని కాపాడిన చిరంజీవి, పట్టణ ఎస్సై సైదుబాబును సీఐ సుబ్బారావు అభినందించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కొనకనమిట్ల: తొలిఏకాదశి పండగ సందర్భంగా మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం పోటీలను కమిటీ నిర్వాహకులు క్రీడా కారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను సర్పంచ్ బోయిన వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ సర్పంచ్ గంటా రమణారెడ్డి, అంజిరెడ్డి, గాయం నర్సిరెడ్డి, జయరామిరెడ్డి, ఎస్.రమణారెడ్డి, కోడె గురవయ్య, యద్దనపూడి ఆశిష్‌కుమార్, పాపారావులు, కమిటి సభ్యులు అందజేయనున్నారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ మువ్వా ఎల్లయ్య అందజేయనున్నారు.

జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి


జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రాం వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు మాట్లాడుతూ దళితజాతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్, బీసీ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక


నిర్మలా జ్యోతిని సన్మానిస్తున్న నూతన కార్యవర్గం

బేస్తవారిపేట: ఒంగోలులోని బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమశాఖ వసతి గృహ సంక్షేమ అధికారుల నూతన కార్యవర్గం ఎంపిక శనివారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా ముత్యాల ప్రసాద్ (ఒంగోలు), జనరల్ సెక్రటరీగా కొండా లక్ష్మీకాంతరెడ్డి (బేస్తవారిపేట), ట్రెజరర్‌గా పూజల వెంకటేశ్వరరావు (కనిగిరి), గౌరవ అధ్యక్షుడిగా భూమా సురేష్ (తర్లుపాడు), సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంక్షేమాధికారిణి నిర్మలా జ్యోతిని నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిశారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఎక్కిన కారు

కంభం: హైవే వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈఘటన ఆదివారం ఉదయం కంభం పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పిడుగురాళ్ల నుంచి మహానందికి వెళ్తున్న ఓ కారు కంభం పట్టణంలోని అనంతపురం–అమరావతి హైవేరోడ్డు పై ఉన్న యూటర్న్ వద్ద అదుపుతప్పి డివైడర్ ఎక్కింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినగా ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం


నాగంపల్లిలో పూజలందుకుంటున్న పీర్లు


వంగపాడులో చావిడిలో కొలువుదీరిన పీర్లు


కొమరోలులో గ్రామోత్సవంలో పీర్లు ..


మార్కాపురం తూర్పువీధిలో పీర్లను నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బేస్తవారిపేట/కొమరోలు: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా గ్రామాల్లోని చావిళ్లను శుభ్రం చేసి పీర్లను కొలువుదించారు. చావిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని వంగపాడు, పెంచికలపాడు, పాపాయిపల్లెలో పెద్దషరిగత్తు నిర్వహించారు.

☛ కొమరోలులోని పెద్దపీర్ల చావిడి, చిన్నపీర్ల చావిడి వద్ద షరిగత్తును ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున గుండంలో కట్టెపుల్లలు చేరుస్తూ ఉన్నారు. పీర్లతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

నిప్పుల గుండంపై నడక..

మార్కాపురంటౌన్/కొనకనమిట్ల: పట్టణంలో గొర్లగడ్డ, తూర్పువీధుల్లోని పీర్లైన బాదుల్లా సాహెబ్, చిన్న బాదుల్లా సాహెబ్ పీర్లకు వైభవంగా షరిగత్ నిర్వహించారు. పీర్లకు పూలమాలలు, నాగాభరణాలు, వెండి గొడుగులు, పూల గుమ్మటాలతో సుందరంగా అలంకరించి పీర్లను పట్టుకొని నిప్పులపై నడిచారు. పీర్లగుండంలో కొబ్బరిచిప్పలను వేసి మొక్కులు తీర్చుకున్నారు.

☛ కొనకనమిట్ల మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, నాగరాజుకుంట, చినారికట్ల, నాయుడుపేట గ్రామాల్లో హోమ గుండాలు ఏర్పాటు చేసి పీర్ల ఉత్సవం చేశారు.

తల్లిదండ్రుల మిస్సింగ్‌పై కేసు

గిద్దలూరు రూరల్: తల్లిదండ్రులు ఇద్దరు కనబడటం లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుమారుడు ఫిర్యాదు చేశాడు. అందిన వివరాల మేరకు.. మండలంలోని సంజీవరాయుడు గ్రామ పంచాయతీలోని దంతెరపల్లె గ్రామానికి చెందిన సారమేకల శ్రీనివాసులు, శారదలు ఇద్దరు గత నెల 29వ తేదీ నుంచి కనబడటం లేదని కుమారుడు మధుమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాబా పాదుకల ఊరేగింపు


బాబా నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మార్కాపురం: పట్టణంలో ఆదివారం షిరిడీ నుంచి వచ్చిన బాబా పాదుకలను భక్తులు దర్శించుకున్న అనంతరం నగరోత్సవాన్ని నిర్వహించారు. పాదుకలను భక్తుల సందర్శనార్థం స్థానిక నెహ్రూ బజారులోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఉంచారు. భక్తులు దర్శించుకున్న అనంతరం పాదుకలను ప్రత్యేకంగా ఏర్పాటుచే సిన వాహనంపై ఉంచి బాబా చిత్రపటంతో నెహ్రూ బజారు మీదుగా నాలుగు మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా బాబా పాదుకలను భక్తుల కోసం షిరిడీ నుంచి తెప్పించినట్లు మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. బాబా వేషధారణలో పలువురు నగరోత్సవం అగ్రభాగాన ఉండగా కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకున్నది. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కోనూరు సతీష్ శర్మ, మనోహర్, మందిరం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.